ముద్దంశెట్టి హనుమంతరావు

పంతం

వాసవి, రైలు రాకకోసం ఆసక్తితో యెదురుచూస్తోంది. ఆమె ఒడిలో రెండేళ్ళ పాప వుంది. చేతిలో ఓ సూట్‌కేసు మాత్రమే!

అప్పుడప్పుడూ ఆమె దృష్టి, ప్లాట్‌ఫారం మీద చివరివరకూ ప్రసరిస్తోంది. ఎవరో వస్తారని. యెదురు చూస్తున్నట్లున్నాయ్ ఆమె చూపులు. కాని, యెవరూ రాలేదు.

అప్పుడే రైలు వచ్చి ఆగింది. ప్రయాణీకులు హడావిడిగా తిరుగుతున్నారు.

వాసవి, లేడీస్ కంపార్టుమెంటు వెదు క్కొని అందులోనికిపోయి కూచుంది. ఆ కంపార్టుమెంటులో అంతగా రద్దీలేదు. సూట్‌కేసు బెంచీకింద పెట్టి, యింకా కిటికీ గుండా దృష్టిని సారిస్తూనే వుంది.

రైలు చాలాసేపు అక్కడున్నా, వాసవి యెదురుచూస్తోన్న వ్యక్తి రాలేదు.

డీజిల్ ఇంజను భయంకరంగా కూత కూసింది. రైలు కదిలింది. వాసవి, బరువుగా ఓ నిట్టూర్పు విడిచింది. రైలు వేగాన్ని పుంజుకుంది. ఆమె ఆశించిన వ్యక్తి రాకపోయేసరికి. ఆమెలోని ఆతృత సన్నగిల్లి, పట్టుదల మరింత బిగుసు కుంది.

ఇంతకీ, ఆమె యెదురుచూస్తోన్న వ్యక్తి, యింకెవరో కాదు. సాక్షాత్తూ ఆమె భర్తే!

* * *

వాసవి భర్త ఆనందరావు, మంచి వాడే! సహనం అతనికి మారుపేరు. సహ ధర్మచారిణి అంటే అతనికి వల్లమాలిన ప్రేమ, అనురాగమూను. అయితే, అతనిలో వుండే చిన్నబలహీనత ఆత్మాభి మానం అధికం!

ఇహపోతే, వాసవి విషయం చెప్పు కోవాలంటే, కలుపుగోలుగా మసలేమంచి అమ్మాయే! భర్తపట్ల గౌరవమే! కాని, పట్టుదల అధికం. ఆమె మాట జరిగి తీరాలి. లేకుంటేనే చిక్కు వస్తుంది.

ఆ రోజు ఆదివారం —

ఆనందరావు, న్యూస్‌పేపరు చదువు కుంటున్నాడు. వాసవి అతనికి దగ్గరగా వచ్చింది.

"ఏవండీ...."

"ఏవిఁటి వాసవీ!"

"ఈ రోజు ఉదయం ఆటకి సినీమాకి వెళ్తున్నానండీ! వంట ముగించేసే వెళ్తా ననుకోండి మీరు కాస్త శ్రమ తీసుకుని వడ్డించుకొని, ఆఫీసుకి వెళ్ళండి." అందామె.

"ఎవరితో వెళ్తున్నావు? పక్కింటి ఆవిడతోనా!" ఆమెకేసి చూస్తూ అడిగాడు, ఆనందరావు.

"కాదండీ! చివరింటావిడ కృష్ణవేణి లేదూ! ఆవిడతో...."

కృష్ణవేణి అంటే, ఆనందరావుకి సద్భావం లేదు. అంటే, మరేవీఁకాదు. ఆవిడకి అందరి విషయాలూఁ అన్ని విషయాలు కావాలి. అన్నీ తెలుసుకున్నాక పూరుకుంటుందా అంటే, అదీకాదు. తనకి తెలిసినవాళ్ళందరికీ చాటుతుంది.అందుకే, ఆ వీధిలో చాలామంది ఆమెతో పరిచ యాన్ని తగ్గించుకున్నారు. అదే కారణం వల్ల, ఆనందరావుకి యిష్టం లేక పోయింది — భార్య ఆవిడతో సినీమాకి వెళ్ళడం!

"ఆవిడతో సినీమాలకి వెళ్ళొద్దని చెప్పాను కదా వాసవీ! నా మాటల్ని పట్టించుకోవేం!" సౌమ్యంగానే అన్నాడు.



"ఆవిడతో వెళ్తే, తప్పేమిటండీ? ఆవిడ గుణం మంచిది కాదంటారా? యెదురుప్రశ్న వేసింది, వాసవి.

"అలా అని నేను అన్లేదే?"

"మరెందుకు వెళ్ళొద్దంటున్నారు?"

"ఆవిడ నోరు మంచిది కాదని అంతా అంటుంటారు, అందుకే!"

వాసవి మెల్లగా మందహాసం చేసింది. "ఎవరో గిట్టనివాళ్ళు, అసూయపరులు అలా అంటారులెద్దూ! ఆమె యెంత కలుపుగోలుగా మాట్లాడుతుందని?" అందామె. "అయినా నేను చెబుతున్నాను కదా వద్దని" అయిష్టంగా అన్నాడు ఆనందరావు.

వాసవి మొహంలో రంగులుమారాయి.

ఆమె అహం దెబ్బతింది.

"అంటే నాకు యేమాత్రం స్వతంత్రం లేదంటారా? నేను కేవలం మీ బానిసనా?" వుద్రికతరో అంది.

విస్తుపోయాడు ఆనందరావు. వాసవి తనని అపార్థంచేసుకుంటోందనుకున్నాడు.

"అర్థంలేనట్టు మాట్లాడకు వాసవీ! ఏ విషయంలో నేను నిన్ను కాదన్నానని?" సూటిగా అన్నాడు.

ఇలా వారి వాదన చినికి చినికి గాలివాన అయినట్టు, పరాకాష్ఠ నందుకుంది. ఫలితంగా పట్టుదలతో, అహంతో వాసవి అక్కగారింటికి బైలుదేరింది.

ఆనందరావు వుండమని బ్రతిమాలలేదు. ఆయనకి ఆత్మగౌరవం వుంది!

వున్నపాటున బైలుదేరింది, వాసవి. ఆనందరావు రైలుటిక్కెట్టుకు డబ్బిచాడు. అది అగ్నిమీద ఆజ్యం పోసినట్టయి, ఆ డబ్బుని విసిరికొట్టింది. ఆమె దగ్గర రెండువందలున్నాయని అతనికేం తెలుసు



ఆనందరావు మరేం అనలేదు. చంటి పాపను తీసుకుని స్టేషనుకి వచ్చేసింది చివరి క్షణంలోనైనా భర్త స్టేషనుకి వచ్చి వెళ్ళొద్దని ప్రతిమాలతాడని, ఆశించింది.... ఎదురుచూసింది, కాని అలా జరగలేదు. ఆమె పంతం మరింత పటిష్ట మైంది.

* * *

రైలు రాజమండ్రిలో ఆగింది. కాఫీ తీసుకుంది వాసవి. చంటిపాపకి బిస్కెట్లు తీసుకుంది.

అంతవరకూ వాసవి మౌనాన్ని ఆమె చేష్టల్నీ తదేకంగా గమనిస్తోంది ఆ కంపార్టుమెంటులోనే వున్న కాంతం. ఆమె పక్కనే వచ్చి కూచుంది.

"ఎందాకా వెళ్తున్నావమ్మా!" ప్రశ్నించింది కాంతం.

"విజయవాడండీ."

"అక్కడ మీ ఆయన వుంటున్నారా!"

"కాదండి. మా అక్క వుంటోంది."

"అలాగా! మీ ఆయనెక్కడుంటున్నారు?"

"విశాఖలోనండీ."

"ఉద్యోగం చేస్తున్నారా?"

"ఔనండీ! పోర్టులో...."

"మరి, విశాఖలో మీ ఆయన నిన్ను సాగనంపడానికి రాలేదేవమ్మా!"

ఆ ప్రశ్నకి, వాసవి కాంతంకేసి యిబ్బందిగా చూసింది.

"తీరిక లేక...." ముక్తసరిగ సమాధాన మిచ్చింది.

కాంతం నవ్వింది. ఆమె పళ్ళు కిళ్ళీ అలవాటువల్ల గామోసు, కసబారి వున్నయ్. ఆమెకి ముప్ఫయిఅయిదేళ్ళుంటాయి. ఆమె మాటల్లో సౌమ్యత, యెదుటి

వారిని ఆకట్టుకునే నేర్పు. వున్నాయి. కాని, నవ్వులో మార్దవంలేదు. చూపులు కరకుగానే వున్నయ్.

"నేను నమ్మను. ఎందుకమ్మా అబద్ధం చెబుతావు? మీ ఆయనతో తగవు పడి వస్తున్నావు, ఔనా?"

ఏవో దివ్యశక్తులున్న వ్యక్తిలా కాంతం అలా అనేసరికి, వాసవికి క్షణం నోటమాటరాలేదు.

"ఎట్లా మీరు గ్రహించారండీ?" ఆమెని పరిశీలనగా చూస్తూ, ప్రశ్నించింది.

కాంతం, మళ్ళీ మెల్లగా మందహాసం చేసింది.

"నేను ప్రతినిత్యం యెంతోమందిని చూస్తుంటాను. వారితో మాట్లాడుతూ వుంటాను. మొహంచూసి, మనిషి మనస్తత్వాన్ని చెప్పేయగల్ను. నువ్వు విశాఖపట్నంలో రైలెక్కిన దగ్గర్నించి నీ చేష్టలు, నీ ఆతృత, నీలోని భావాలు, గమనిస్తూనే వున్నాను. అందుకే, గ్రహించగలిగాను. మీ ఆయన నీతో గొడవతెచ్చుకున్నాడూ అంటే, ఆయన వట్టి మూర్ఖుడనే చెప్పాలి. లేదా తెలివి తక్కువవాడైనా అయ్యుండాలి.ఎందుకో తెలుసా? నీ అంతటి అందగత్తెతో తగువు పడ్డమా? నిజానికి, నీ అందానికి దాసోహమనాలి. విన్ను పువ్వుల్లోపెట్టి పూజించాలి. అసలు, నీలాంటి అపురూప సౌందర్యవతి బొంబాయిలాటి నగరంలో వుండివుంటే, నీ జీవితమే మరో స్థాయిలో వుండేదికదూ? కారుల్లో తిరిగేదానివి.... పూల పాన్పుల్లో శయనించేదానివి.... ఒహ చేమిటి? ఆ జీవితం వర్ణనాతీతంగా వుండేది."

వాసవికి, ఆమె మాటల్లోని గూఢార్థం అర్థం కాలేదు.

"అంటే, మీ వుద్దేశం?" అమాయకంగా అడిగింది.

కాంతం కాస్త తెప్పరిల్లింది. వాసవిలో ఆసక్తిని గమనించి తృప్తి పడింది.

"ఏముందమ్మా? నీలాంటి అందగత్తె బొంబాయి లాంటి నగరంలో వుంటే, ఎన్ని సినీమా ఛాన్సులు.... ఎన్ని అడ్వర్టయిజ్‌మెంట్ల ఆఫర్లు ....? డబ్బుకి కొదవే వుండదు. డబ్బుతోపాటు పేరుప్రతిష్టలు, జీవితం భోగభాగ్యాలతో స్వర్గతుల్యంగా వుంటుంది. అటువంటిది, నువ్వీరోజు యిల్లాంటి పరిస్థితిలో వున్నావంటే. నిజంగా నాకే బాధాకరంగా వుంది." గుక్కతిప్పుకోకుండా అంది, కాంతం. ఆమె మాటలతీరు చూస్తుంటే కొద్దాగొప్పో చదువుకున్నట్టే కనిపిస్తోంది. "మీరు బొంబాయిలో వుంటున్నారా?" యినుమడించిన ఆసక్తితో అడిగింది, వాసవి. ఆమెకి, యెందుకో కాంతం గురించి తెలుసుకోవాలన్న జిజ్ఞాస కలిగింది.

సర్వసాధారణంగా ఆడవాళ్ళను మెప్పించాలంటే, వాళ్ళ అందాన్ని తెగ పొగిడితే చాలు— ఐసయిపోతారు. అదే జరిగింది వాసవి విషయంలోనూ. తనకి తెలీని యేదో గొప్పతనం తనలో వుందనిపించిందామెకి.

కాంతం, మురిపెంగా చిన్న నవ్వు నవ్వింది.

"ఔనమ్మా! ఇప్పుడా? ఎన్నేళ్ళనించో వుంటున్నాను. మా ఆయన బొంబాయిలో ఓ పెద్ద స్టూడియోలో కెమెరామెన్. ఈ మధ్యనే మాకు తెలిసిన ఓ కాకినాడ అమ్మాయిని తీసుకెళ్ళి, మా ఆయన సినీమా ఛాన్సు యిప్పించారు. మరి కొన్నాళ్ళకి, ఆమె ఓ పెద్ద 'స్టార్' అయి కూచుంటుంది చూడు! ఇటువంటి అదృష్టాలు, అవకాశాలు, ప్రయత్నాలవల్ల రావమ్మా! హఠాత్తుగా, అనుకోకుండా వచ్చేస్తూ వుంటాయి. అటువంటి అదృష్టమే నీకూ పట్టనున్నదేమో అనిపిస్తోంది."

వాసవి, క్షణం యోచనలోపడింది. సినీమాలంటే ఆమెకి మొదట్నుంచి పిచ్చే, అందుకే కాంతంమాటలు ఆమెలో కొంత అలజడిని సృష్టించాయనే చెప్పాలి. కాని, భర్త ఒప్పుకుంటాడా? "కాని, మా ఆయన ఒప్పుకోరండి!" బేలగా అంది వాసవి.

కాంతం మళ్ళీ నవ్వింది.

"ఇంకా, 'మీ ఆయన' అంటావేవిటమ్మా నీ తెలివితక్కువతనం కాపోతే! నువ్వు ఓసారి మీ ఆయనతో తగువుపడి ఇల్లు దాటావంటే, అక్కడితో కథ ముగిసినట్టే! నీకు మళ్ళీ ఆ ఇంట్లో స్థానం వుండదు. అదే వుద్దేశంతో, మీ ఆయన నిన్ను వుండమని కూడా అనలేదు సరికదా, మర్యాదకోసమైనా స్టేషనుకి రాలేదు. నువ్వు వెళ్ళిపోవడమే అతను కోరుకున్నది.. యిప్పటికీ అర్థంచేసుకోలేకపోతున్నావా!" పరిస్థితిని భూతద్దంలో చూపించినట్టుగా వివరించింది. కాంతం.

వాసవి, తెల్లమొహం వేసింది. ఆమె చెప్పినట్టే జరుగుతుందా! ఆమెకి కళ్ళు తిరిగినట్టయ్యాయి. తాను 'పంతం'తో వచ్చేసింది. తనని తీసుకెళ్ళడానికి, ఆయన రాకపోతే....? తనే ఆత్మాభిమానాన్ని, పట్టుదలని, చంపుకుని ఆయన దగ్గరికి వెళ్ళాల్సిందేనా? అప్పుడింక, తనకి మర్యాద యేముంటుంది?.... తనెందు కంతగా దిగజారిపోవాలి? తనకి మాత్రం ఆత్మగౌరవం లేదూ? కాంతం అన్నట్టు తనకి బొంబాయిలో సినీమా ఛాన్సు వస్తే....? తన భవిష్యత్తే మారిపోతుందే! ఆ తలంపు ఓసారి వచ్చిందిగా? మళ్ళీ గుండెల్లో గుబులు.... యేదో భయం.... ఆమె మనస్సు పరిపరివిధాల ఆలోచనల్ని సాగించింది.

"అయితే కాంతంగారూ, మా ఆయన నన్ను మళ్ళీ యింటికి రానివ్వరంటారా?" అయోమయంగా ప్రశ్నించింది.

కాంతం నేర్పుగా నవ్వింది.

"పిచ్చిదానా ! నీకు ప్రపంచజ్ఞానమే శూన్యంలా వుంది. ఆడది ఇంట్లోనించి పట్టుదలతో బైటపడిదంటే, ఆమె శీలం గురించి యెన్నో శంకలుపుడతాయి భర్తకి ఇహ లోకులు గురించి చెప్పనవసరం లేదు. కాకుల్లా పొడుస్తారు. నువ్వు నిజం చెప్పినా నమ్మరు. అటువంటి పరిస్థితుల్లో నువ్వు అందరికి తలొంచాల్సిన అవసరం రావొచ్చు. ఏ తప్పుచేయని నువ్వు యెందుకు తలొంచాలి! నీలో యింతటి అపురూప సౌందర్యం వుందికూడా ఎవరి కయినా యెందుకు దాసోహమనాలి ! నీకే వాళ్ళంతా దా సో హ మ నా లి. నువ్వు సినిమాల్లో చేరి, పుష్కలంగా డబ్బు గడిస్తుంటే, అప్పుడు నీ భర్తే కోరివచ్చి నీ పంచన చేరుతాడు. నీ మంచిని కోరి చెప్తున్నాను. ఆలోచించు."

వాసవి మళ్ళీ ఆలోచనల్లో పడింది. ఏం చెయ్యడమో, ఆమె ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. ఎందుకయినా మంచిది, అక్క సలహా తీసుకోవడం మంచి దే మో న న్న స దు ద్దే శ ం ఆమెలో మొలకెత్తింది "నాకు సినీమాల్లో వేషాలు వేయడమంటే సరదాగానే వుందండీ; అ యి తే నే ం — మా అక్క సలహా తీసుకోకుండా నేనే నిర్ణయానికి రాలేను. దానికి సినీమాలంటే మరీ పిచ్చి. ఈ విషయం చెబితే, అదీ కాదనదేమో!" వుత్సాహంగానే అంది.

కాంతం నిరుత్సాహపడింది. ఆమె మొహం మ్లానమయింది.

మీ అక్క సలహా తీసుకుందుకు, వ్యవధియేదీ! నేను నేరుగా యీబండిలోనే వెళ్ళిపోవాలి కదా!" అంది కాంతం.

అదీ నిజమే; కాంతం వెళ్ళిపోతే, అట్లాంటి పరపతిగల వ్యక్తి తారసపడాలి కదా మళ్ళీ! కాని.... కాని.... తానుగా ఏ నిర్ణయాన్నీ తీసుకోలేదు. తన శ్రేయోభి లాషి అక్కని అడగాల్సిందే!—అనుకుంది వాసవి.

"అలా అయితే నేనేం చెయ్యలేనండీ మా అక్కని అడక్కుండా నేను యే నిర్ణ యాన్ని తీసుకోలేను. మీరో రోజు విజయవాడలో ఆగలేరా!"

"నాకు అక్కడ బోల్డు పనులున్నా యమ్మా! ఎలాగా అని ఆలోచిస్తున్నాను."

"మరేంచేస్తాంలెండి...." నిరుత్సా హంగా అంది వాసవి.

కాంతంకి యేమి పాలుపోలేదు. ఎన్ని విధాల ప్రయత్నించినా, వాసవిని తనకి అనుకూలంగా మార్చుకోవడం కష్ట సాధ్యమే ననిపించింది. చివరి ప్రయ త్నంగా తనే ఓ రోజు విజయవాడలో వుండిపోవడం మంచిదనిపించింది,

"ఏవిటో వాసవీ; నిన్ను చూస్తుంటే నిన్నెలాగయినా తారాపథంలోకి తీసుకు పోవాలనిపిస్తోంది. నువ్వేమో, మొండి పట్టుతో మీ అక్క సలహా తీసుకోవా లంటున్నావు. సరే మరేంచేస్తాం? అలాగే

కానియ్. కాని. ఒక్క విషయం, ఆడ వాళ్ళ మనస్తత్వాలు చిత్రమైనవి. ఎంత అక్క చెల్లెళ్ళయినా, ఒకరు వృద్ధిలోకి వస్తారంటే, మరొకరికి అసూయగా వుంటుంది. ఇదే కారణంవల్ల మీ అక్క వద్దంటుందనుకో, అప్పుడేం జేస్తావు?"

సూటిగా వాసవి మొహంలోకి చూస్తూ అడిగింది.

"అప్పటి విషయం నాకు నేనుగా ఆలోచిస్తాలెండి."

కాంతం బరువుగా ఓ నిశ్వాసం వదిలింది.

"సరే, నీకోసం, నీ భవిష్యత్తు కోసం నేను యీ ఒక్కరాత్రి విజయవాడలో వుండుపోతాన్లే వాసవీ! నిన్ను జూస్తుంటే సహాయం చేయాలనిపిస్తోంది! రేపు వుదయం సరిగ్గా యేదో ఒక నిర్ణయాని కొచ్చి నేరుగా వచ్చేసెయ్. నేను చెప్పిం దంతా గుర్తుంచుకో. త్రీల వెయిటింగు రూమ్‌లో వుంటాను ఏం" అంది కాంతం తానేదో వాసవి శ్రేయస్సుకే యిదంతా చేస్తున్న భావన ఆమెలో కలిగిస్తూ.

"అలాగేలెండి...."

మరికొద్ది సేపట్లో రైలు విజయవాడ ప్లాట్‌ఫారం మీద ఆగింది గంభీరంగా. విద్యుద్దీపాల వెల్తురులో ప్లాట్‌ఫారం కళకళలాడుతోంది. ఎక్కడ చూసినా ప్రయాణీకులే!

వాసవి హఠాత్తుగ ప్లాటుఫారంపై అక్క వాసంతి బావమూర్తి నిచూసిఆశ్చర్య పోయింది, వాళ్ళెందుకొచ్చారోనని.

"అక్కా!" అని కేకవేసింది.

వాసంతి వాసవి కంఠస్వరాన్ని గుర్తు పట్టినట్టుగా. ఆమెకేసి తిరిగి చూసింది. ఆమె మొహంలో ఆశ్చర్యం తొణికిస లాడింది.

వాసంతి, మూర్తి వాసవి వున్న కంపార్టుమెంట్ దగ్గరికి వచ్చారు.

"ఇదేవిటే అనుకోకుండా ఓ కార్డు ముక్కయినా రాయకుండా వచ్చావు!" ప్రశ్నించింది వాసంతి.

"ఆనందరావు యేడీ!" అడిగాడు మూర్తి.

వాసవి అప్పటికే బండి దిగింది.

"అవన్నీ తర్వాత చెప్తాలేగాని! మీరిలా వచ్చారేవిటి! మావారు టెలి గ్రామ్ గాని యిచ్చారా!" తన అనుమా నాన్ని నివృత్తి చేసుకుందుకు ప్రశ్నిం చింది."

"అబ్బే అటువంటిదేం లేదే! మా ఇంటి ప్రక్కవాళ్ళు మద్రాసువెళ్తుంటేను వాళ్ళని సాగనంపడానికి యిలా వచ్చాం. నీ సంగతేవిటి!" అంది వాసంతి

"తర్వాత చెబుతాలే! మీరు వాళ్ళని యెక్కించేసి రండి,ఇక్కడే వుంటాను."

"ఫరవాలేదులేవే! మీ బావగారు వెళ్ళి వస్తారులే. మనం ఇక్కడ వుందాం." అంటూ భర్తను పంపింది వాసంతి.

అంతవరకు అక్కడేవున్న కాంతం వాసవిని వుద్దేశించి,

"నేను వుంటానమ్మా వాసవీ!నేను చెప్పిం గుర్తుంచుకో. నీ భవిష్యత్తు గురించి మర్చిపోకు వస్తా!" అని చెప్తూ అక్క డ్నించి వెళ్ళిపోయింది కాంతం.

"ఎవరే యీవిడ" అనక్తిగా అడిగింది వాసంతి!

"ఇంటికి పద, చెప్తాను."

"అబ్బ అన్నీ తర్వాత చెప్తాన్ అంటున్నావు.... ఏమిటో అర్థంకాదు!." విసుగ్గా అంది వాసంతి,

"చెప్తానన్నాగ!" అంటూ ప్రసంగాన్ని మార్చేసి మూర్తి వచ్చేవరకు గడిపేసింది.

మూర్తి రానే వచ్చాడు.

"పోదామా!" అన్నాడు వస్తూనే.

"వాళ్ళకి చెప్పారా, నేను రాలేక పోయానని."

"చెప్పాను . పద!" బైయలుదేరాడు వాసవి దగ్గర్నుంచి సూట్ కేసు తీసుకుని. అతన్ని అనుసరించారు వాళ్ళిద్దరు అక్కచెల్లెలు.

* * *

ఆ రాత్రి భోజనాలయ్యాక, తీరిగ్గా కూచున్నారు వాసంతి, మూర్తి, వాసవీను. అప్పుడు చెప్పింది వాసవి, తానెందుకు వచ్చేసిందీ, రైల్లో కాంతం కలిసి యేం సలహా యిచ్చిందను.

అంతా విన్నాక వాసంతి బాధగా నిట్టూర్పు విడిచింది.

"నీకు ఎన్నిసార్లు చెప్పినా, అహాన్ని చంపుకోలేకపోతున్నావే వాసవి! నువ్వు చేసిన పని తప్పని నీకు అనిపించక పోవడం నీ తెలివితక్కువతనానికి నిదర్శనం...." అంటూ మందలించింది వాసంతి.

మూర్తి అందుకున్నాడు!

"అది సరేగాని వాసవి, బండిలో కలిసి నీకు బంగారు భవిష్యత్తును కల్పిస్తానని చెప్పిన ఆ కాంతం గురించి నీ కేమీ అనుమానం కలగలేదా!" ప్రశ్నించాడు.

"అనుమానమా! ఎందుకు బావ అనుమానం! అయోమయంగా అంది వాసవి.

"ఎందుకేమిటి, ఇటీవల యెన్నో సంఘటనలు చదువుతున్నాం వార్తాపత్రికల్లో నీకు గుర్తు లేదా; అమె నీ మీద జాలి పడి, బొంబాయి తీసుకుపోయి. సినిమా చాన్సు యిప్పిస్తానంటే నువ్వు నిజమేనని నమ్మేశావా!"

"నిజంకాదా!" తెల్లమొహం వేసింది వాసవి.

"ఎంత అమాయకురాలివి వాసవీ! నీకు అహం వుందేగాని అలోచన లేదు. ఎంత ప్రమాదం తప్పిందో, తెలుసా! నీలో యిన్ని ఆశలు రేకెత్తించి నిన్ను మభ్య పెట్టి బొంబాయి తీసుకుపోవాలనే ఆమె ప్రయత్నించి నువ్వు వెళ్ళివుంటే, నిన్ను చిత్రసీమలో కాదు ప్రవేశపెట్టేది.... వేశ్యాగృహంలో.... నీ అందాన్ని క్యాష్ చేసుకుంటారన్న మాట.."

"ఆ.." సుమారు మూర్ఛపోయినంత పనయింది, వాసవికి. అమె మొహం స్వేదతో నిండింది. ఓసారి చీరచెంగుతో మొఖాన్ని ఒత్తుకుంది.

"ఎంత వుపద్రవం తప్పిందో చూశావా వాసవీ! ఏ దేవుడో నిన్ను పరోక్షంగా కాపాడాడు గాని! నాతో సంప్రదించాలని వచ్చావు! లేకుంటే, యేం జరిగేదో....

ఇదంతా యెందుకు జరిగిందంటావు? నువ్వు మీ ఆయన్తో కయ్యం పెట్టుకుని విడిపోయి వచ్చేసిన నీ తెలివితక్కువ అనరాగా,ని ఆదో బలహీనతగా తీసుకుం దామె. ఆ క్షణంలో నీ అదృష్టం బావుండి ఆపాటి విచక్షణాజ్ఞానం పొడచూపింది. నీలో అహం ఎటువంటి అనర్థం తెస్తుందో యిప్పుడైనా ఆలోచించు వాసవీ!" మళ్ళీ మందలించింది వాసంతి.

వాసవి మరి వినలేకపోయింది.

ఆమె కళ్ళు నీళ్ళపర్యంత మయ్యాయి.

"నన్ను క్షమించక్కా. నా తప్పు తెలుసుకున్నాను. దాని పర్యవసానాలు పరోక్షంగా యెలా వుంటాయో తెలుసు కున్నాను. రేపే ఆయన దగ్గరికి వెళ్ళిపో తాను!" రుద్ధస్వరంతో అంది వాసవి.

"ఈ క్షణంలో పశ్చాత్తాపపడడం కాదే వాసవీ; మళ్ళీ యెప్పుడు యిలాంటి పొరపాటు జరక్కుండా చూసుకో!"

"అలాగేనక్కా."

"సర్లేగానీ వాసవీ, ఆ బొంబాయి మహిళ యెక్కడుంటానండి?" అడిగాడు.

"స్త్రీల వెయిటింగ్‌రూమ్‌లో...."

సరే, రేపు నువ్వు మామూలుగా బైలుదేరు. తర్వాత కథ నేను నడుపు తాను" అన్నాడు మూర్తి.

సరేనన్నట్టు తలూపింది వాసవి.

* * *

మర్నాడు మూర్తి తనకి తెలిసిన ఓ యస్.ఐ.ని కలిసి సంగతంతా వివరిం చాడు. ఎస్.ఐని మఫ్టీలో మూర్తివాసవిలతో స్టేషనుకి వచ్చాడు.

వాసవి ముందు నడుస్తోంది, చేతిలో ఒక్క సూట్‌కేసుతో. వాసవికోసం వొళ్ళంతా కళ్ళుచేసుకుని యెదురు చూస్తోన్న కాంతం, ఆమె వస్తూండటం చూసి సంతోషంతో వుక్కిరిబిక్కిరి అయ్యింది. నవ్వుతూ ఆహ్వానించింది.

"వచ్చేశావా వాసవీ! మీ అక్క ఒప్పు కుంది కదా! అహా! నాకెంతో ఆనందంగా వుంది సుమా," అంది ఒక్క గుక్కలో కాంతం.

వాసవి సన్నగా మందహాసం చేసింది ఏం మాట్లాడలేదు!

"చంటిపాపని వదిలేసి మంచిపని చేశావు...." మళ్ళీ అంది కాంతం.

అప్పుడే అక్కడికి చేరుకున్న మూర్తి "నిజమే! మీకు మరీ లాభం.. అంతే కదూ!" అన్నాడు.

"ఏవిటండీ మీరంటున్నది?" తెల్ల బోతూ అంది కాంతం.

"ఏవిటో యిక్కడ కాదు చెప్పడం పోలీసు స్టేషన్లో. నేనెవర్నో తెలుసా! ఎస్.ఐ.ని. నీ ఆట కట్టించాలని యిలా మఫ్టీలో వచ్చాను. ఇలా యెంతమందిని మోసంచేసి తీసుకెళ్ళావో నీచేతకక్కిస్తా అంటూ, "మూర్తీ పోలీసుస్టేషనుకి ఫోనుచెయ్యి వేను పంపిచమన్నానని.." అన్నాడు. మూర్తి అక్కడ్నించి స్టేషను మాష్టరుగారికేసి వెళ్ళాడు.

కాంతంమొహం మ్లానమయ్యింది. ఎలాగయినా తప్పించుకోవాలని ఆమె మనసు ఘోషిస్తున్నా తప్పించుకోవడం సాధ్యంకాదనుకుని మొహం దించుకుంది

"నువ్వో స్త్రీవై వుండి స్త్రీలనే యిలా వంచిస్తూ వుండటం, మరీ రాక్షసత్వం. నిన్నిలా విడిచిపెట్టను.. ముందు పోలీసు స్టేషనుకి పద....చెప్తా...." కటువుగా అన్నాడు ఎస్.ఐ.

"ఏదో బుద్ధి గడ్డితింది బాబుగారు కనికరించి నన్నొదిలేయండి మరెప్పుడూ యిటాంటి పని చెయ్యను." అంటూ లెంపలేసుకుంది కాంతం.

"ఈ వేషాలు నా దగ్గర పనికిరావు, నీకున్న ముఠా ఎక్కడుందో తెలుసు కోకుండా నిన్ను విడిచిపెడతాననుకోకు ....నోరు మూసుకుని పడుండు" అని గర్జించాడు యినస్పెక్టర్.

కాంతం దిగాలుపడిపోయింది. వాసవి పట్ల ఆమెకి కసి, కోపం పెరిగినయ్.... ఆమెకేసి యెర్రగా చూసింది కాని యేం చేయగలదు! పోలీసు వేను రానే వచ్చింది. కాంతం వేనులో కూచోబెట్టి తనూ వేనులోనే వెళ్ళిపోయాడు ఇన్స్పెక్టర్.

"చూశావా వాసవీ, నా అనుమానం యెలా నిజమయిందో" అన్నాడు మూర్తి.

"థాంక్స్ బావ!" మొహం దించుకొని అంది.

వాళ్ళిద్దరు ఇంటికి వెళ్ళిపోయారు.

ఆరోజు సాయంత్రంబండికే కూతుర్ని తీసుకుని భర్త దగ్గరికి ప్రయాణం కట్టింది వాసవి. ఆమె వెంట వాసంతి, మూర్తి కూడా వెళ్ళారు.

* * *

ఆనందరావు వాసవిని చిరునవ్వుతో ఆహ్వానించాడు,

వాసవి సిగ్గుతో మొహం దించుకుంది.

వాసంతి, మూర్తి పరస్పరం మొహాలు చూసుకొని నవ్వుకున్నారు.